వైద్యసేవలను విస్తృతం చేయ్యాలి

- పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నారాయణపేటరూరల్, సెప్టెంబర్ 20 : ఉచిత వైద్య శిబిరాల ద్వారా జిల్లాలో వైద్య సేవలను విస్తృతం చేయాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. శుక్రవారం పాతగంజ్‌లోని యశోద కేర్ దవాఖాన, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులకు ఉచితంగా రక్తపరీక్షలతోపాటు స్కానింగ్ నిర్వహించి మందులను పంపిణీ చేసిన యశోదకేర్ వైద్యులు రవీందర్‌లకావత్, ప్రీతిరెడ్డితోపాటు లయన్స్‌క్లబ్ ఆఫ్ నారాయణపేట సభ్యులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్, మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణభట్టడ్, క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు రాఘవేందర్‌రెడ్డి, బాలాజీ, కోశాధికారి మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కరించాలి

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 20 : గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అధికారులకు ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో దామరగిద్ద, నారాయణపేట మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, డీఆర్డీవో మొగులప్ప, డీపీవో కృష్ణ, పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యుత్, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి
- ముదిరాజ్‌లు సామాజికంగా చైతన్యం కావాలి
- మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్

మట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మరికల్, సెప్టెంబర్ 20 : ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి చేర్చాలని, తనకు రాష్ట్ర మంత్రి పదవి కంటే ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చితే ఎక్కువ సంతోషంగా ఉంటుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నారాయణపేట, మహబుబ్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మను, డైరెక్టర్లను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌తోపాటు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని డిమాండ్ ఉందని, దీని పై సీఎంతో మాట్లాడి మార్చేవిధంగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ మాట్లాడుతూ ముదిరాజ్‌లు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా చైతన్యవంతులు కావాలని, రాష్ట్రంలో, జిల్లాలో ముదిరాజ్‌లు 30–40శాతం జనాభ ఉన్నా మనకు ఎమ్మెల్యేలు ఒక్కరే ఉన్నారని అందుకే ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం నారాయణపేట, మహబుబ్‌నగర్ మార్కెట్ కమిటీల వైస్ చైర్మన్లు హన్మంతు, పెద్ద విజయ్‌కుమార్‌లతోపాటు డైరెక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నేతలు నారాయణ, కిశోర్, నాగరాజు, ఈదప్ప, నరహరి, కాంత్‌కుమార్, శ్రీనివాసులు, చంద్రశేఖర్, కొండన్న, రాములు, వెంకటన్న పాల్గొన్నారు.

అన్నా.. నీ బదులుగా నేను ఎమ్మెల్యే అయ్యా..

మరికల్‌లో నిర్వహించిన ముదిరాజ్‌ల సన్మాన కార్యక్రమంలో ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌ను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సన్మానిస్తూ.. అన్న నీ బదులుగా నేను ఎమ్మెల్యే అయ్యాను అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎర్ర శేఖర్ నారాయణపేట ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. బీసీ సమీకరణలో మక్తల్‌కు బదులుగా నారాయణపేట నుంచి ఎర్రశేఖర్ అన్నకే సీటు ఖరారైనట్లు ప్రచారం జరిగింది. కానీ అనుకోని పరిస్థితుల్లో శేఖర్ అన్న పార్టీ మారడంతో నాకు మక్తల్‌లో పోటీ చేసే అవకాశం వచ్చిందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అంటూ ఎర్ర శేఖర్‌ను సన్మానించారు.

క్రీడలు స్నేహపూర్వక వాతావరణంలో జరగాలి

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

పోటీలు ప్రారంభిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే

బాలానగర్ (రాజాపూర్), సెప్టెంబర్ 20 : క్రీడలు స్నేహపూర్వక వాతావరణంలో జరగాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిర్మలాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారులు చూపిస్తే మినీ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయిస్తానని అన్నారు. పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. క్రీడల్లో ప్రతిభను చాటుకోవాలని విద్యార్థులకు సూచించారు. సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో మశ్చేందర్, హెచ్ఎంలు సుధాకర్, రఘునందన్‌రెడ్డితోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రల సమ్మె విరమణ

మహబూబ్‌నగర్ , సెప్టెంబర్ 20 : రాష్ట్ర వ్యాప్తంగా విధులు బహిష్కరించి సమ్మె చేపట్టగా ప్రభుత్వం దిగివచ్చి సమస్యల పరిష్కారానికి ముందుకు రావడంతో సమ్మె విరమించినట్లు ఆరోగ్య మిత్రలు జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి దామోదర్ రాజనర్సింహాతో సమస్యలపై చర్చించినట్లు వివరించారు.

JAYAPRAKASH NARAYAN COLLEGE OF ENGINEERING
(NAAC Accredited-UGC Autonomous)(Affiliated to JNTUH, Hyderabad. Approved by: AICTE & Govt. of Telangana), Mahabubnagar-509001 (Non-Minority) www.jpnce.ac.in
ADMISSION NOTIFICATION FOR CATEGORY 'B' FOR MBA, MCA & M.TECH FOR 2024-25

Course	Intake	Seats
MBA	120	36
MCA	120	36
M.Tech (DSCE)	18	05
M.Tech (CAD/CAM)	18	05

The last date for submission Applications for **MBA, MCA** and **M.Tech is dt.30.09.2024.** Admissions will be made as per the guidelines of Telangana Council of Higher Education. For Further details **Contact: 8886680004/05/07/25.**
Date:20-09-2024 **Sd/- PRINCIPAL**

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

KIDNY STONES
★మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో పరిష్కారం, 47 సం. అనుభవంతో 100% గ్యారంటీ, జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580
NT- 332617

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331771-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- కలెక్టర్ విజయేందిరబోయి

గండీడ్ : వెన్నాచేడ్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

గండీడ్, సెప్టెంబర్ 20 : ప్రభుత్వ ఉద్యోగులు విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టరు విజయేందిరబోయి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వెన్నాచేడ్‌లో హెల్త్ సబ్ సెంటర్, గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్‌లో గర్భిణులు, పిల్లలకు ఇచ్చే టీకాలను ఎప్పటికప్పుడు ఇస్తున్నారా? ప్రజాఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గరకు వెళ్లి శానిటేషన్ ఏ విధంగా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో వడ్డించే పప్పు పల్చగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఉపాధ్యాయులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో మీకు బాధ్యతా లేదా అంటూ ఉపాధ్యాయులను ప్రశ్నించారు. అనంతరం సల్కరర్‌పేట్ గ్రామంలో సబ్ సెంటర్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంపీవో నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, నాయకులు పులీందర్‌రెడ్డి, విజయ్ కుమార్‌తోపాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

ప్రతిరోజూ పాఠశాలకు రావాలి

విద్యార్థులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- పేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణ పేట రూరల్, సెప్టెంబర్ 20 : విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాలకు రావాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొల్లంపల్లి జెడ్పీహెచ్ఎస్‌ను తనిఖీ చేశారు. ముందుగా కలెక్టర్ ఉపాధ్యాయుల బోధన రికార్డులు, విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని తరగతి గదులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు శుక్ర, శనివారాల్లో జరిగే స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులకు కచ్చితంగా హాజరుకావాలని, పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా కలెక్టర్ తనిఖీ చేశారు.

అధికారులతో జెడ్పీ సీఈవో సమీక్ష

జడ్చర్ల, సెప్టెంబర్ 20 : జడ్చర్ల మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులతో జెడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జడ్చర్లలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జడ్చర్ల మండలంలో ఆయా శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా స్వచ్ఛ హీ సేవా, డ్రైడే సందర్భంగా శుక్రవారం జడ్చర్ల మండలంలోని ఆలూరు గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరుగుతూ కాలనీలను, డ్రైనేజీలను పరిశీలించారు. అనంతరం సీఈవో మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను వాడరాదని, పరిసరాలను అందరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమాలలో ఎంపీడీవో విజయకుమార్, ఎంఈవో మంజులాదేవి తదితరులు ఉన్నారు.

జీపీలకు నిధులు ఇప్పించాలి

మూసాపేట/మాగనూర్, సెప్టెంబర్ 20 : గ్రామ పంచాయతీల నిర్వహణకు నిధులు లేక ప్రతి రోజూ సమస్యలు వస్తున్నాయని, ఉన్న నిధులలో నుంచి గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాలు తప్పితే ఎలాంటి చెక్కులు పాస్ కావడం లేదని వారు శుక్రవారం మూసాపేట ఎంపీడీవో కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయడానికి అప్పులు తెచ్చి పెడుతున్నట్లు, జీతాలు రాక పంచాయతీ కార్యదర్శులు కుటుంబాలు వీధిన పడే పరిస్థితులు వచ్చాయని వారి సమస్యలను వివరిస్తూ, వెంటనే గ్రామ పంచాయతీల నిర్వాహణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మాగనూరు మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో రహ్మతుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు.

సలహాలు పాటించాలి

దేవరకద్ర, సెప్టెంబర్ 20 : గ్రామీణప్రాంతంలోని వ్యవసాయ రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఏరువాక కేంద్రం పాలెం శాస్త్రవేతలు భరత్ భూషణ్‌రావు, రాంరెడ్డి, విజయలక్ష్మి, దివ్యరాణి సూచించారు. శుక్రవారం మండలంలోని పెద్దరాజమూర్ గ్రామంలో వరిలో కాండం తొలుచు పురుగు, బాక్టీరియా ఎండాకు తెగులు నివారణకు చర్యలు, వరి పొలంలో పోషకాల యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు యశ్వంత్ రావు, ఏవో రాజేంద్ర అగర్వాల్, ఏఈవో పాల్గొన్నారు.

డీఐఈవోకు సన్మానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 20 : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు పాటు పడాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారిణి కౌసర్ జహన్ సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఐఈవోను శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీపీజేసీ యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షుడు విజేత వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి రమేశ్‌గౌడ్,సురేశ్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గాంధీ విగ్రహాన్ని ఢీ కొట్టిన లారీ

మాగనూరు/కృష్ణ, సెప్టెంబర్ 20 : బూడిద లారీ గాంధీ విగ్రహాన్ని ఢీకొట్టగా పూర్తిగా ధ్వంసమైన ఘటన కృష్ణ మండలం హిందూపూర్‌లో శుక్రవారం ఉదయం చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం రాయిచూర్ నుంచి వస్తున్న బూడిద లారీ హిందూపూర్‌లోని ప్రధాన కూడలిలో ఉన్న గాంధీ విగ్రహాన్ని డ్రైవర్ నిద్ర మత్తులో ఉండి ఢీకొట్టడంతో విగ్రహం పూర్తిగా ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న ఆర్యవైశ్య సంఘం పెద్దలు అక్కడి చేరుకోగా అందరి సమక్షంలో సదరు డ్రైవర్ పాత విగ్రహం స్థానంలో కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

జడ్చర్ల, సెప్టెంబర్ 20 : దారిదోపిడీ, బైకులు దొంగతనం చేసే ఇద్దరు దొంగలను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరు తెలిపారు. శుక్రవారం జడ్చర్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో దొంగతనానికి సంబంధించిన వివరాలను సీఐ ఆదిరెడ్డితో కలిసి డీఎస్పీ వెల్లడించారు. భూత్పూర్ మండలం కొత్తూరుకు చెందిన శివశంకర్, నాగర్‌కర్నూల్ జిల్లా గగ్గలపల్లికి చెందిన లతీఫ్ దారిదోపిడీ, బైకులను దొంగతనం చేసినట్లు వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఈ క్రమంలో జడ్చర్ల ఫ్లైఓవర్ దగ్గర వాహనాల తనిఖీ చేస్తుండగా శివశంకర్, లతీఫ్ బైక్‌పై వెళ్తుండగా వారి వద్ద బండి కాగితాలు లేకపోవడంతో అనుమానంతో విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకోగా అరెస్టు చేశామని చెప్పారు.

ఘనంగా సాయిచంద్ జయంతి

కేక్ కట్ చేస్తున్న సాయిచంద్ సతీమణి రజిని

మూసాపేట(అడ్డాకుల)/జడ్చర్ల, సెప్టెంబర్ 20 : తెలంగాణ ఉద్యమ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాయిచంద్ జయంతి వేడుకను శుక్రవారం అడ్డాకులలో ఘనంగా నిర్వహించారు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి యువసైన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సాయిచంద్ సతీమణి కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్ హాజరై స్థానికులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్, మహేశ్‌యాదవ్, జాహంగీర్‌గోరి, బాలరాజు, రాము, రమేశ్ పాల్గొన్నారు. జడ్చర్లలోనూ సాయిచంద్ జయంతిని నిర్వహించగా రజనీసాయి చంద్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈవో మంజులాదేవి, లయన్ నటరాజ్, రాంరెడ్డి, రాధికారెడ్డి, విక్కి, దత్తుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

వైద్య శిబిరంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి

నారాయణపేట, సెప్టెంబర్ 20 : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సునీత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు నర్సింహారావు సగరి, ప్రోగ్రాం ఆఫీసర్ సాయిరాం, వైద్యులు రాఘవేందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, హెల్త్‌అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యంగా ఉండాలి

మక్తల్, సెప్టెంబర్ 20 : కార్మికులు ఆరోగ్యంగా ఉండాలని డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మక్తల్ మున్సిపాలిటీలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కార్మికులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ లక్ష్యమని ప్రతి కార్మికునికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను సన్మానం

నారాయణపేట, సెప్టెంబర్ 20 : పట్టణంలోని మున్సిపల్ కార్మికులను శుక్రవారం వీహెచ్‌పీ, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. గణేశ్ ఉత్సవాలలో మూడు రోజుల పాటు నిద్రాహారాలు మాని పారిశుధ్య పనులు నిర్వహించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విధులు నిర్వర్తించినందున సన్మానించడం జరిగిందని వారు తెలిపారు. కార్యక్రమంలో రఘురామయ్యగౌడ్, వెంకట్రాములు, మెలగిరి కాంబ్లే, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాపర్‌వైర్ నిందితుల అరెస్టు

- రూ.4.50లక్షలు రికవరీ
- డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల, సెప్టెంబర్ 20 : ఇటీవల సోలార్ ప్లేట్ల దగ్గర దొంగతనాలకు పాల్పడుతున్న కాపర్‌వైర్ నిందితులను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.4.50లక్షలు రికవరీ చేసినట్లు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వరు తెలిపారు. శుక్రవారం జడ్చర్లలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాపర్ వైర్ల దొంగతనానికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ద్రోణాచలానికి చెందిన 11మంది గల గ్యాంగ్ సోలార్ పలకలను అమర్చి విద్యుత్‌ను తయారు చేసే కేంద్రాల దగ్గర ఉండే వైర్లను దొంగతనం చేసి వాటిని కాల్చి అందులోని కాపర్‌ను అమ్ముకునే దొంగల ముఠాను పట్టుకున్నట్లు తెలిపారు. ముగ్గురు వ్యక్తులు మిడ్జిల్ మండలం మున్ననూరు టోల్‌గేట్ దగ్గర ఆటో వెళ్తుండగా అనుమానం వచ్చి వారిని పట్టుకోవడం జరిగిందని, వారి వద్ద రూ.4.50 లక్షల నగదు ఉండటంతో డబ్బులు ఎక్కడి అని ప్రశ్నించగా ఆటోను కొనుగోలు చేయడానికి వెళ్తున్నటు తెలిపారని దాంతో వారిపై అనుమానంతో వారిని స్టేషన్‌ను తరలించి విచారించగా సోలార్ ప్లేట్ల దగ్గర దొంగతనానికి పాల్పడింది తామేనని తెలిపినట్లు డీఎస్పీ తెలిపారు. దాంతో వారిని పూర్తిస్థాయిలో విచారించగా మొత్తం 11మంది గ్యాంగ్ ఉన్న ట్లు తెలిపారు. అందులో బాలస్వామి, జయరాజ్‌లు విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు తెలిపారు. ప్రస్తుతం ముగ్గురు సత్యదాస్, మధు, మునుగురాయి రామకృష్ణ పట్టుబడ్డారని, మిగతా ఆరుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. బోయిన్‌పల్లి, రాణిపేట, ఆమన్‌గల్, అడ్డాకల్, సీసీకుంట, కల్వకుర్తిలలో కాపర్‌వైర్లు, మానవపాడులో సెంట్రింగ్ డబ్బులు, మక్తల్ బ్యాటరీలు, తదితర ప్రాంతాల్లో వారిపై మొత్తం ఎనిమిది కేసులు ఉన్నట్లు వివరించారు. సమావేశంలో జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, మిడ్జిల్ ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు ఉన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి

దేవరకద్ర, సెప్టెంబర్ 20 : ప్రభుత్వ ఉద్యోగి పని చేసే ప్రదేశంలో అంకిత భావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని మండల విద్యాధికారి జయశ్రీ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన వెంకటేశ్వర్లుకు ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం నాగేంద్రమ్మ, హెచ్ఎం బాసిత్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, అశ్విని చంద్రశేఖర్, కల్పన, విజయలక్ష్మి, మురళీధర్, అద్రి, శంకర్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 20 : పట్టణంలోని ప్రభుత్వ చిన్న పిల్లల దవాఖానలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహమూద్‌అలీ డిమాండ్ చేశారు. శుక్రవారం చిన్న పిల్లల దవాఖానని వారు పరిశీలించి రోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు కాశప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరహరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాలకృష్ణతోపాటు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్ఈ

మాగనూరు సెప్టెంబర్ 20 : మాగనూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ ప్రభాకర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సబ్ స్టేషన్‌లోని మెయింటెనెన్స్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాగనూర్, కృష్ణ ఉమ్మడి మండలాల్లో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని చిన్నచిన్న వాటికి కరెంట్ తీసి గంటల తరబడి కోతలు విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాగనూరు ఏఈ దేవేందర్, కృష్ణ ఏఈ ధర్మతేజ, లైన్‌మెన్లు జగదీశ్‌రెడ్డి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

రూ.3లక్షల రుణ సదుపాయం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 20: పీఎం విశ్వకర్మ పథకం ద్వారా రూ.3లక్షల వరకు రుణ సదుపాయం పొందే అవకాశం ఉందని మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ శాంతయ్య తెలిపారు. శుక్రవారం ఆ కళాశాలలోని పీఎం విశ్వకర్మ పథకం ఏడాది పూర్తయిన సందర్భంగా ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజరు కల్వభాస్కర్, నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏడీ రాఖీకుమారి, ఇన్‌స్ట్రక్టర్ అశోక్, వెంకటేశ్వర ఫర్టిలైజర్ మహబూబ్‌నగర్ ఐఎంసీ వైస్‌చైర్మన్ వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తోటల పెంపకం లక్ష్యం పూర్తి చేయాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 20 : జిల్లాలో నిర్దేశించిన 2,500 ఎకరాల ఆయిల్ పామ్ తోటల పెంపకం లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం ఆమె తన చాంబర్‌లో జిల్లాస్థాయి ఆయిల్‌పాం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్లస్టర్ స్థాయి అధికారుల సంఖ్య పెంచాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ విజయేందిరబోయి ఆదేశించారు. శుక్రవారం వైద్యారోగ్యశాఖ కార్యక్రమాలపై ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సబ్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లతో కలెక్టర్ కార్యాలయం నుంచి వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ షూటింగ్ బాల్ దినోత్సవం

మక్తల్, సెప్టెంబర్ 20 : జాతీయ షూటింగ్ బాల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణపేట జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మక్తల్‌లో ర్యాలీ నిర్వహించినట్లు షూటింగ్ బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ గోపాలం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1976 సెప్టెంబర్ 20నుంచి భారతదేశంలో జాతీయ షూటింగ్ బాల్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మక్తల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డీవీ చారి, నిర్వహణ కార్యదర్శి అమ్రేశ్, దామోదర్, జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొన్నారు.

రేపు లింగంపల్లిలో మెగా వైద్యశిబిరం

నవాబ్‌పేట, సెప్టెంబర్ 20 : మండలంలోని లింగంపల్లిలో ఈనెల 22వ తేదీన సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ కిశోర్‌బాబు, నవాబ్‌పేట మాజీ ఎంపీపీ శీనయ్య శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. లింగంపల్లితోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ధన్వాడ, సెప్టెంబర్ 20 : ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించే 10వ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ధన్వాడ మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకుల విద్యార్థులు లోకేశ్, ప్రవీణ్,విష్ణులు ఎంపికైనట్లు కోచ్ రామ్మోహన్‌గౌడ్ తెలిపారు. వీరిని ప్రిన్సిపాల్ రాజారాం ఉపాధ్యాయులు అభినందించారు.

48 గంటల పాటు నీటి సరఫరా బంద్

నారాయణపేట/మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 20 : మిషన్ భగీరథ కొత్త పైప్‌లైన్‌లు అమరుస్తున్న కారణంగా 21నుంచి 23వ తేదీ వరకు 48 గంటల పాటు మక్తల్, నారాయణపేట నియోజకవర్గాలలోని పలు మండలాలకు నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని మిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్ కార్యనిర్వాహక అభియంత వెంకట్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మరికల్ నుంచి నారాయణపేటకు వెళ్లే మార్గంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ 4 ప్రదేశాలలో లీకేజీలు ఏర్పడ్డాయని, వాటిని తీసి కొత్తపైపులు అమర్చేందుకు 48గంటల సమయం పడుతుందన్నారు. దీంతో మన్యంకొండ నీటి శుద్ధి కేంద్రం నుంచి నీటి సరఫరా అయ్యే నర్వ, మరికల్, ఊట్కూర్, నారాయణపేట, దామరగిద్ద మండలాలు పూర్తిగా, మక్తల్, ధన్వాడ మండలాలు పాక్షికంగా, నారాయణపేట, మక్తల్ మున్సిపాలిటీలలో పూర్తిగా నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

దేవరకద్ర, సెప్టెంబర్ 20 : గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని తాసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు పోషకాహారాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కింటాకు రూ.8,308 పలికిన పెసళ్లు

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 20 : పేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం 71 క్వింటాళ్ల పెసళ్లు విక్రయానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.8,308, కనిష్ఠంగా రూ.4,091 ధర పలికాయి. 9 క్వింటాళ్ల వేరుశనగ విక్రయానికి రాగా క్వింటాకు రూ. 3,319, 13 క్వింటాళ్ల మినుములు విక్రయానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ. 5,292 కనిష్ఠంగా రూ.3,359 ధర పలికినట్లు సూపర్‌వైజర్ లక్ష్మణ్ తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మరికల్/ధన్వాడ, సెప్టెంబర్ 20 : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో కొండన్న సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలకేంద్రంతోపాటు మాద్వార్, పస్పుల గ్రామాల్లో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బ ంది పాల్గొన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ధన్వాడలో విద్యార్థులు ర్యాలీని నిర్వహించారు.

పశువైద్య శిబిరం విజయవంతం

నవాబ్‌పేట, సెప్టెంబర్ 20 : మండలంలోని కొల్లూరు గ్రామంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పశువైద్య శిబిరం విజయవంతమైంది. మండల పశువైద్యాధికారి డా.రవిచంద్ర పర్యవేక్షణలో పశువులకు గర్భకోశ నివారణ చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగానే పశువులకు, బర్రెలకు గొడ్డుబోతుతనము, చూడి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శిబిరంలో 360 పశువులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో రాంప్రసాద్, నాయకులు రామకృష్ణ, వాసుయాదవ్, వెంకటయ్య, కృష్ణ, లక్ష్మయ్య ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

భూత్పూర్, సెప్టెంబర్ 20 : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మండలంలోని కొత్తమొల్గరలోని ప్రాథమిక పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట సీఎంవో బాలుయాదవ్, సీఆర్పీ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

బాలానగర్, సెప్టెంబర్ 20 : బాలానగర్ మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందారు. ఫరూక్‌నగర్ మండలం వెల్జర్లకు చెందిన రెహానాబేగం (40), ఆమె కుమారుడు రఫీక్‌తో కలిసి బైక్‌పై రాజాపూర్ మండలం చొక్కంపేటలో వారి బంధువు చనిపోగా చూసిరావడానికి బయలుదేరారు. బాలానగ ర్ చౌరస్తాలోని వేగనియంత్రికల వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుకాల వస్తున్న ఓ భారీ కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ అదుపుతప్పి బోల్తాపడగా కంటైనర్ రెహానాబేగం తలపై నుంచి వెళ్లింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కుమారుడు రఫీక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని జడ్చర్ల దవాఖానకు తరలించినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

మూసాపేట, సెప్టెంబర్ 20 : మండలంలోని తుంకినీపూర్‌కు చెందిన వ్యక్తి బావిలో పడి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన లక్ష్మయ్య(57) గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నట్లు తెలిపారు. ఏవరైనా పనిచెప్తే చేయడం, వారు పెట్టింది తిని వ్యవసాయ పొలాల వెంటనే తిరుగుతూ ఉండేవాడని తెలిపారు. మూడు రోజుల నుంచి ఇంటికి రాలేదని, శుక్రవారం ఉదయం అటువైపు వెళ్లిన కూలీలు చూసి ఎవరో తుంకినీపూర్ గ్రామ శివారులోని శ్రీనివాస్‌రెడ్డి బావిలో పడి చనిపోయినట్లు చెప్పడంతో గ్రామస్తులు వెళ్లి చూసి లక్ష్మయ్యగా గుర్తించారు. గ్రామస్తులు మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.